క్లుప్తంగా

సీకాం డైరెక్టర్ ప్రణీత్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సీకాం డైరెక్టర్ ప్రణీత్

తిరుపతి సిటీ : సీకాం విద్యాసంస్థల డైరెక్టర్ టి.ప్రణీత్‌కు నార్త్ అమెరికాలోని హయతీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బ్యాంకాక్‌లో జరిగిన కార్యక్రమంలో భారత మాజీ మంత్రి సురేష్ ప్రభు చేతుల మీదుగా ప్రణీత్ డాక్టరేట్ అందుకున్నారు. గత 13 ఏళ్లుగా ఎడ్యుకేషన్- అడ్మినిస్ట్రేషన్, విద్యా రంగంలో ఆయన చేసిన కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఎస్వీయూలో ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించండి



వీసీ రాజారెడ్డితో సమావేశమైన రాయలసీమ మేధావుల ఫోరం సభ్యులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించాలని రాయలసీమ మేధావుల ఫోరం సభ్యులు కోరారు. వారు శుక్రవారం వీసీ రాజారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఫోరం సమన్వయ కర్త మాకిరెడ్డి పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీలో అంతర్గత రోడ్లను జూపార్కు ప్రధాన రోడ్డుతో అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలపై అనుమానాలకు తావులేకుండా విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ ప్రతిపాదనలపై ఈసీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వీసీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వీసీని కలసిన వారిలో ఆచార్య జయచంద్రారెడ్డి, ఆచార్య దామోదర్ రెడ్డి వున్నారు.

ఆయుష్షు హరిస్తున్న విషతుల్య ఆహారోత్పత్తులు

- గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో దీని నుంచి విముక్తి
- రైతులకు శిక్షణ కార్యక్రమాలతో కేంద్రం కార్యాచరణ అవసరం
- భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత మోహిని మోహన మిశ్రా



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా

తిరుపతి కల్చరల్: దేశంలో రోజు రోజుకూ ఆస్పత్రులు, మెడికల్ షాపుల సంఖ్య పెరుగుతోందని, ఆహారోత్పత్తుల్లో క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువుల అవశేషాల వల్ల ప్రజల ఆయుష్షు తగ్గుతోందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సాధికారత సంస్థ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇస్కాన్ వద్దనున్న టీటీడీ మైదానంలో మూడు రోజుల ఆర్గానిక్ మేళాను శుక్రవారం ప్రారంభించారు. రైతుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా మిశ్రా మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌పై అనేక రకాల కుట్రలు జరిగాయని, ఇందులో ఆహారంపై రసాయన ప్రయోగాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా విషతుల్య రసాయనాలను పొలాల్లో వాడడం వల్ల భూమి క్రమేణా నిస్సారమవడమే కాకుండా వృక్ష సంపద, పశు సంపద నాశనమవుతోందన్నారు. ప్రస్తుతం ప్రజల్లో అనేక వ్యాధులకు కారణం అధిక రసాయనాలతో కూడిన ఆహార ఉత్పత్తులే కారణమన్నారు. వీటిని నుంచి బైట పడాలంటే గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం దిశగా రైతాంగం మరలాలని, దీనికిగాను కేంద్రం రైతులకు దేశవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలతో ప్రత్యేక కార్యాచరణకు పూనుకోవాలన్నారు. రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ అధికారి బి.ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తోందని, అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయంలో రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం 665 మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, తద్వారా సుమారు 10 లక్షల మంది రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని తెలిపారు. అలాగే ఆరోగ్యకరమైన వ్యవసాయోత్పత్తులను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రధానంగా టీటీడీకి బెల్లం, ఆవు నెయ్యి, శనగలు పలు రకాల కూరగాయలు అందిస్తున్నామన్నారు. ఇక నుంచి 365 రోజుల పాటు తిరుమలలో ఇటు శ్రీవారి ప్రసాదాలు, ఉచిత అన్నదాన కార్యక్రమానికి తమ రైతుల నుంచి అన్ని రకాల ఆహార ఉత్పత్తులు తీసుకుంటామని టీటీడీ అధికారులు తెలిపారని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఎలా ఆర్థికంగా పురోగమిస్తున్నారో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు కుమార్‌స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణంరాజు, కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, రైతు సాధికార సంస్థ తిరుపతి జిల్లా అధికారి మునిరత్నం, చిత్తూరు జిల్లా అధికారి వాసు, మిద్దె తోటల పెంపకందారుల కోర్ కమిటీ సభ్యుడు టీవీ మనోహర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,140
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,491
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,200
రిటైల్ వెండి గ్రాము	రూ.76.20

ఆన్‌లైన్ ద్వారా మరింత పారదర్శకంగా శ్రీవారి సేవలు

- డయల్ యువర్ ఈవోలో ఏవి ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి సేవలో పాల్గొనే భక్తులు సేవ కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ విధానం ద్వారా మరింత పారదర్శకంగా శ్రీవారి సేవ కేటాయిస్తున్నట్టు టీటీడీ ఈవో ఏవీ. ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. శ్రీవారి సేవ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే కేటాయిస్తున్నామని, ఎవరైనా డబ్బులు తీసుకుని సేవ తీసిస్తామంటే నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో జేఈవోలు సదా భార్గవి, శ్రీ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ ఓ నరసింహ కిషోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

సైదాపురం: తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమ జంట శుక్రవారం సైదాపురం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. సైదాపురం అరుంధతీయవాడకు చెందిన అడసనపల్లి శివ, చిట్టమూరు మండలానికి చెందిన కావ్య ప్రేమించుకున్నారు. ఈ జంట రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్ఐ చల్లా వాసుకు విన్నవించారు. వీరికి వెంట వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్‌తో పాటు పలువురు ఉన్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకున్నారని, వారికి అండగా నిలవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, అవిలాల చెరువు వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి(37) మృతి చెందాడు. ఎరుపు రంగు టీషర్ట్, బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్ ధరించినట్లు తిరుపతి రూరల్ పోలీసులు వెల్లడించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తిరుపతి రూరల్ పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐక్యతగా మెలుగుదాం

- చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల పార్టీ నేతలతో భేటీ
- దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లులో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



ఎర్రావారిపాళెంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : ఐకమత్యంగా మెలుగుదాం-పార్టీ ఉన్నతికి కలిసికట్టుగా కృషి చేద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమాభివృద్ధి ఘననీయంగా జరుగుతోందని, పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో చేయూతనందిస్తోందని తెలిపారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. చేసిన మేలును మరో సారి ప్రజలకు గుర్తుచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు యుగంధర్‌రెడ్డి, శివకుమారి, జెడ్పీటీసీ స్వరూప, కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, నాగార్జునరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కాటన్ మిల్లులను పునరుద్ధరించరూ!

-కేంద్ర జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఎంపీ వినతి



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రం ఇస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి కాటన్ మిల్లులను పునరుద్ధరించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖామంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. తిరుపతి కాటన్ మిల్లుతో పాటు హస్తకళ సేవా కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. కాటన్ మిల్లుల పునరుద్ధరణకు ఆర్థిక మంత్రిత్వ శాఖకి సంబంధించిన నీతి ఆయోగ్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంతో సంప్రదించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని గతంలో జౌళి మంత్రిత్వ శాఖ సమాధానం ఇచ్చిందనానరు. ఈ మిల్లుతో 1000 కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, మిల్లు పునరుద్ధరణకు సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తెలిపారు. అలాగే తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో కలంకారీ వంటి పురాతన ప్రసిద్ధ హస్తకళలను ప్రోత్సహించడం కోసం తిరుపతిలో హస్తకళ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని, హస్తకళలు మార్కెట్ చేసేందుకు తిరుపతిలో మంచి అవకాశం ఉన్న దృష్ట్యా తమ ప్రతిపాదనలను పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీకి బదులిచ్చారు.

అందరికీ అందుబాటులో ఓపెన్ స్కూల్



ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కో-ఆర్డినేటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అందరికీ అందుబాటులోకి ఓపెన్ స్కూల్‌ను తీసుకొచ్చిందని రాష్ట్ర కో-ఆర్డినేటర్ పైడాల రవీంద్రనాథ్ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శుక్రవారం తిరుపతి జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లకు అడ్మిషన్ల ప్రక్రియపై ఒక రోజు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిని 2008-09, ఇంటర్‌ను 2010-11 ప్రవేశ పెట్టారన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్లో చేయాల్సి ఉంటుందని చెప్పారు. పదో తరగతిలో 5 సబ్జెక్టులు ఉంటాయని, ఆరవ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చని, నచ్చిన మీడియంలో పరీక్షను రాయవచ్చని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత 30పీసీపీ తరగతులు నిర్వహించాలని, 3ట్యూటర్ మార్క్‌డ్ అసైన్‌మెంట్లు, 2ప్రిపరేటరీ పరీక్షలు విద్యార్థులతో రాయించాలని చెప్పారు. ఓపెన్ స్కూల్ విద్య రెగ్యులర్ విద్యతో సమానంగా పరిగణిస్తారని తెలిపారు. చదువును మధ్యలో మానేసిన వారు, ఉద్యోగంలో ప్రమోషన్లు కోరే ఉద్యోగస్తులు, గృహిణులు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగపు అసిస్టెంట్ కమిషనర్ ఆనందరెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

శంకరంబాడి జయంతిని ఘనంగా నిర్వహించండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌కే బాబు

తిరుపతి తుడా: ఈ నెల 10వ తేదీన శంకరంబాడి సుందరాచార్యులు జయంతిని కార్పొరేషన్ తరపున ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు కోరారు. ఆయన శుక్రవారం కమిషనర్ హరితకు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహాన్ని తొలగించినట్లు చెప్పారు. దాన్ని పునరుద్ధరించి లక్ష్మీపురం సర్కిల్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. బుదంగుంట్ల కుమార్, రఫీ హిందూస్థానీ, బచ్చన నాగరాజు పాల్గొన్నారు.

సినిమా ఫక్కీలో ఎర్రచందనం దుంగల రవాణా

- అంబులెన్స్‌లో ఎర్రచందనం తరలిస్తున్న పది మంది అరెస్ట్
- టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ వెల్లడి

తిరుపతి మంగళం: సినీ ఫక్కీలో అంబులెన్స్‌లో ఇద్దరు రోగులు ఉన్నట్లు నటిస్తూ ఎర్రచందనం రవాణా చేస్తున్న పది మంది ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం కడప సబ్ కంట్రోల్ నుంచి ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం రైల్వే కోడూరు రేంజ్ బాలపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. శుక్రవారం ఉదయం బైక్‌పై వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కొంత దూరంలో అంబులెన్సులో ఎర్రచందనం దుంగలను ఎక్కిస్తూ స్మగ్లర్లు కనిపించారు. అక్కడ ఉన్న ఏడుగురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పది ఎర్రచందనం దుంగలు, అంబులెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు టు బాలపల్లి.. వయా తమిళనాడు, బెంగళూరు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి తమిళనాడుకు చెందిన ఏలగిరి అనే మేస్త్రీ ద్వారా తమిళ కూలీలను సమకూర్చుకుని బెంగళూరుకు పంపించారు. అక్కడి నుంచి ఈ కూలీలను ప్రసాద్ అనే వ్యక్తి తీసుకుని తిరుపతి మీదుగా బాలపల్లి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. బాలపల్లి వద్ద అంబులెన్సులోకి ఎర్రచందనం దుంగలను ఎక్కించుకుని లక్ష్మీనరసయ్య డ్రైవరుగా, ప్రసాద్, మహేష్ అనే వ్యక్తులు రోగులుగా నటిస్తూ ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ కేసులో 14మంది ఉండగా, 10 మందిని అరెస్టు చేశారు. వారిలో కడపకు చెందిన నిమ్మల ప్రసాద్(49), లక్ష్మీనరసయ్య(47), ప్రొద్దుటూరుకు చెందిన జి.సతీష్‌కుమార్(37), తమిళనాడు తిరువణ్ణామలైకి చెందిన మరిదిరి(61), గోవిందన్(45), కాళి(49), జి.సేతు(35), కాశి(35), హరి(25), రాజుమాణిక్యం(40) ఉన్నారని డీఎస్పీ వివరించారు. మరో నలుగురు పారిపోయారని, వారిని పట్టుకోవడానికి ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డితో ప్రత్యేక బృందాన్ని నియమించామని చెప్పారు. ప్రధాన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామన్నారు. ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ ప్రేమ పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల ధర్నా

తిరుపతి అర్బన్: సత్యవేడు మండలంలోని దాసుకుప్పం, రాచపాళెం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. బాలసుబ్రమణ్యం, నాగభూషణం, వెంగమ్మ, కిరణ్ పాల్గొన్నారు.

ఎస్వీయూతో టీమ్లీజ్ ఎడ్‌టెక్ సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో రిజిస్ట్రార్ హుస్సేన్, టీమ్లీజ్ ఎడ్‌టెక్ ప్రతినిధులు

తిరుపతి సిటీ: ఆన్‌లైన్ దూర విద్యకు సంబంధించి ఎస్వీయూతో ముంబయికి చెందిన టీమ్లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఎస్వీయూ పరిపాలనా భవనంలో శుక్రవారం వారు పత్రాలు మార్చుకున్నారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా డిస్టెన్స్ లెర్నింగ్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్‌తో నూతన కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. సంస్థ సీఈఓ రోహిత్, డైరెక్టర్ నాగరాజు నాయుడు, ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. డీన్ ఆచార్య అప్పారావు, కోఆర్డినేటర్లు ఆచార్య తవమణి, శ్రీదేవి పాల్గొన్నారు.

హాస్టల్లో ఉండడం ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి

తిరుపతి రూరల్: హాస్టల్లో ఉండడం ఇష్టలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం టీఎన్ కుప్పానికి చెందిన గీతాంజలి(17) తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురంలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. హాస్టల్లో ఉండడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పి ఇంటికి వెళ్లింది. చదువు మధ్యలో ఆగిపోకూడదని సర్దిచెప్పిన తల్లిదండ్రులు గురువారం ఉదయం గీతాంజలిని హాస్టల్లో వదిలివెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన గీతాంజలి గురువారం సాయంత్రం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుంది. గుర్తించిన విద్యార్థినులు వార్డెన్‌కు సమాచారం అందించారు. ఆమెను తిరుపతి రుయాకు తరలించగా అప్పటికే గీతాంజలి మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ పూర్యనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది నిందితులకు జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో చోరీలకు పాల్పడిన 9 మంది నిందితులకు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని శ్రీవారి హుండీలో రూ.500 చోరీ చేసిన కేసులో విజయవాడ పాయకపురానికి చెందిన ఎస్.సాయితేజకు రెండు నెలలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు. తిరుమల ఎస్ఎన్‌సీ అతిథి గృహంలో భక్తుల నుంచి రూ.30,500 నగదు, రెండు గ్రాముల బంగారు నగలు చోరీ చేసిన కేసులో పాకాల జయదేవపురం కాలనీకి చెందిన పి.శాంతకుమార్, తిరుపతి జీవకోనకు చెందిన ఎస్.విజయ్‌కుమార్, తిరుపతి తాతయ్యగుంటకు చెందిన కె.శివకుమార్‌కు రెండు నెలలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు. అలాగే తిరుమలలో బేడి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మహిళ మెడలో బంగారు చైన్‌ను లాగడానికి ప్రయత్నించిన కేసులో, మినీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులో నగదు చోరీ చేసిన కేసులో వైఎస్ఆర్ జిల్లా కడప టౌన్ రవీంద్రనగర్‌కు చెందిన చాంద్ బేగంకు ఒక్కొక్క కేసులో ఒక నెల జైలు శిక్ష రూ.100లు జరిమానా విధించారు. తిరుమలలో రెండు వేరు వేరు చోట్ల భక్తుల సెల్‌ఫోన్లను చోరీ చేసిన పలనాడు జిల్లా నరసరావుపేట మండలం, కీసన్నపల్లికి చెందిన కె.శ్రీనివాసరావు, కర్ణాటక బీదర్ జిల్లాకు చెందిన శ్రీపాద, తమిళనాడు ఈరోడ్‌కు చెందిన ఎస్.కాళీయప్పన్‌కు ఒక్కొక్కరికి రెండు నెలలు జైలు శిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధించారు. తిరుమల సుదర్శన్ కాంప్లెక్స్‌లో భక్తుడి సెల్‌ఫోన్ చోరీ చేసిన కర్ణాటక బళ్లారికి చెందిన కె.రమేష్‌కు రెండు నెలలు జైలు శిక్ష, రూ.100లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, అగరాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను మృతిచెందాడు. అతనికి 45 ఏళ్లు ఉంటాయని పోలీసులు తెలిపారు. కేసు విచారిస్తున్నట్లు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి..

పాకాల: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి సమీపంలోని సుందరాంగిపల్లి అండర్ బ్రిడ్జ్ సమీపంలో సుమారు 30 ఏళ్ల లోపు ఉన్న యువకుడు రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. అతను బ్లూకలర్, తెలుపు, పచ్చ రంగు టీషర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్లకు జీతాలు చెల్లించాలని వినతి

తిరుపతి ఎడ్యుకేషన్: పదోన్నతులు, బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ తెలిపారు. ఆయన శుక్రవారం డీఈఓ వి.శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలల జీతాలు అందలేదన్నారు. నాగరాజు, సాంబిరెడ్డి, ప్రసాద్‌రాజు, మహేష్, దేవరాజులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ నాయకులు నాయకులు సూర్యప్రకాష్, డి.నిర్మల, పి.రమేష్‌నాయుడు, డి.రామచంద్రయ్య, బండి మధుసూదనరెడ్డి తదితరులు శుక్రవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అదేవిధంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, శ్రీనివాసులు, యువశ్రీమురళి, మునికృష్ణనాయుడు, వాసు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన సునీల్ చక్రవర్తి



తిరుపతి మంగళం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శుక్రవారం తిరుపతిలోని ఆయన నివాసంలో రాష్ట్ర రవాణాశాఖ సభ్యుడు ముత్తంశెట్టి సునీల్‌చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సునీల్‌చక్రవర్తి చెప్పారు.

గడప గడపకూ సంక్షేమం



ప్రజలతో మాట్లాడుతున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. అయన శుక్రవారం వెంకట్రామాపురం పంచాయతీ లింగమనాయుడు కండ్రిగ, కట్టకింద వెంట్రామాపురం, కట్టకింద వెంకట్రామాపురం ఏఏడబ్ల్యూ, కమ్మపల్లి, కమ్మపల్లి ఏఏడబ్ల్యూలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి కానుక పంపిణీ



తరుపతి మంగళం: రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీలోకి చెందిన నూతన వధువులకు శుక్రవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను పంచాయతీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ అందజేశారు. షేక్ రజాక్, ఉపసర్పంచ్ ఉమాపతి, మురళి, సతీష్, భాస్కర్, సురేంద్ర, మునికృష్ణ పాల్గొన్నారు.

ఎస్వీ గో సంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల: ఒడిశాకు చెందిన శివం కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు. సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన వై.రాఘవేంద్ర డీడీని ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

వివేకానందుని బోధనలను ఆదర్శంగా తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానంద అందించిన బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా యువజన సమ్మేళనంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, యువత అనుసరించాల్సిన విధానాలను వివరించారు.

ప్రజాభీష్టం మేరకే ముందడుగు

- అభివృద్ధిలో భాగంగానే మొదటి, ఐదో గేట్ రోడ్ల విస్తరణ
- 2, 3, 4 గేట్ల రోడ్లు యథాతథంపై కౌన్సిల్‌లో నిర్ణయం
- యూనివర్సిటీకి కల్యాణి డ్యామ్ నీటి సరఫరాకు యత్నం
- ఉద్యోగులతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



ఎస్వీయూ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి సిటీ: నగరాభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని, ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా ప్రజాభీష్టం మేరకే ముందడుగువేస్తామని డిప్యూటీ మేయర్ భూమన్ అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై బోధన, బోధనేతర, తాత్కాలిక ఉద్యోగులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు అనుకూలంగానే నగరపాలక సంస్థ వ్యవరిస్తుందన్నారు. యూనివర్సిటీలో రెండు, మూడు, నాలుగో గేట్ రోడ్ల నిర్మాణం విషయంలో అభ్యంతరాలు వస్తున్నాయని, ఆ ప్రతిపాదనను కౌన్సిల్ సమావేశంలో చర్చించి యథాతథంగా ఉంచేందుకు ప్రయతిస్తామన్నారు. మొదటి, ఐదో గేట్ రోడ్లను మాత్రమే విస్తరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం మొదటి గేట్ రోడ్డులో సబ్‌వేలను, అండర్ పాస్ రహదారులను నిర్మిస్తామన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు సూచించిన ప్రతిపాదనలపై ఈ నెల 8న జరగనున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. యూనివర్సిటీ బ్యూటిఫికేషన్, డ్రైనేజీల విషయం అధికారులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీకి కల్యాణి డ్యామ్ నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అవసరమైతే మాస్టర్ ప్లాన్ రోడ్ల అవసరం, ప్రాధాన్యతపై విద్యార్థి సంఘాలతో, ఉద్యోగులతో మాట్లాడతామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రతిపాదన అందరికీ ఆమోదయోగ్యం



మాస్టర్ ప్లాన్ రోడ్లతో వర్సిటీ నూతన శోభను సంతరించుకుంటుంది. సమీపంలోని పెద్దాసుపత్రులకు వచ్చే రోగులు ట్రాఫిక్ సమస్యలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కనెక్టివిటీ రోడ్లతో ట్రాఫిక్ సమస్య తొలగిపోతుంది. విద్యార్థులకూ సమస్య ఉండదు. ఒకటి, ఐదో గేట్ల మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదన మాకు ఆమోదయోగ్యం.

– ప్రొఫెసర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, టీచింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఎస్వీయూ

అభివృద్ధిని ఆకాంక్షించే రోడ్ల విస్తరణ



రోడ్ల విస్తరణతోనే నగరం అభివృద్ధి చెందుతుంది. మొదటి, ఐదో గేట్ రోడ్ల విస్తరణకు ఆమోదం తెలిపాం. మొదటి గేట్ రోడ్డులో భారీ వాహనాల ప్రవేశం వద్దన్నాం. డ్రైనేజీ, వాటర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించాం. వర్సిటీ అభివృద్ధిపై డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించారు. ట్రాఫిక్ సమస్యకు రోడ్ల విస్తరణ అత్యవసరం.

-కె.మురళీరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ ప్రెసిడెంట్, ఎస్వీయూ

పర్యావరణ, పరిశుభ్రతపై దృష్టి అభినందనీయం



యూనివర్సిటీలో పరిశుభ్రతపై గతంలో దృష్టి సారించలేదు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టడం శుభపరిణామం. డిప్యూటీ మేయర్ హామీతో విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రజల శ్రేయస్సు కోసం నగరపాలక సంస్థ తీసుకునే నిర్ణయాలను స్వాగతిస్తున్నాం.

-డి.గౌరీశంకర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇంజినీరింగ్ కళాశాల, ఎస్వీయూ

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ



ట్రాఫిక్ సమస్యతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ మాస్టర్ ప్లాన్ అమలు చేస్తోంది. గత ప్రభుత్వంలోనే మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఆమోద ముద్ర పడింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే ఎన్ని సంస్థలు ఉన్నా ఉపయోగం వుండదు. యూనివర్సిటీ రోడ్ల విస్తరణతో అభివృద్ధి జరుగుతుంది.

-ఇ.చంద్రశేఖర్, నాన్ టీచింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, ఎస్వీయూ

యూనివర్సిటీ అభివృద్ధే ధ్యేయం



ఎస్వీయూ అభివృద్ధే మా ధ్యేయం. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై పలు విద్యార్థి సంఘాలు అభ్యంతరాలు తెలి పాయి. ఈ విషయాలను డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి వివరించాం. డ్రైనేజీ, నీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చాం. ఆయన సానుకూలంగా స్పందించడం శుభపరిణాం. డిప్యూటీ మేయర్ ప్రతిపాధనను ఆమోదిస్తున్నాం.

–డాక్టర్ ఆకేపాటి శివానందరెడ్డి, అధ్యక్షులు, ఎస్ఎంఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు 75వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం ఆలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే ప్రధాన రోడ్లలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలను ఆలయం వద్దకు అనుమతించవద్దన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు చేపట్టాలన్నారు. ఈ ఏడాది భక్తులు అత్యధికంగా వచ్చే అవకాశం ఉందని, సుమారు 70 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వృద్ధులు, పసిబిడ్డ తల్లులు ప్రధాన రహదారి నుంచి ఆలయానికి వచ్చేందుకు ఉచిత ఆటోలను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం అన్న ప్రసాదాలు వితరణ చేయాలని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దామలచెరువు, పాకాల మార్గాల్లో రెండు చొప్పున నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నాయకులు నంగా బాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, వల్లివేడు విక్రమ్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, రఘు, సర్పంచులు గౌరీశంకర్‌రాజు, కస్తూరి, కళావతి, లింగయ్యనాయుడు, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోండి



పోషణ కిట్లు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎర్రావారిపాళెం మండలం నెరబైలు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని ప్రభుత్వం ఇంటికే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ శివకుమారి, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత

భాకరాపేట: గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శుక్రవారం చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్ల వద్దకే ఈ పౌష్టికాహార కిట్లను ప్రభుత్వం పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనితావాణి, సర్పంచులు మనోహర్, సింహాల విమల పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం జగనన్నకు చెబుదాం, స్పందన తదితర కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారుడిని కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అతని ఫీడ్ బ్యాక్‌ను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పరిష్కారం కాని వాటికి గల కారణాలను తెలియజేయాలన్నారు. శ్రీనివాస సేతు నిర్మాణంలో భాగంగా తొలగించి భద్రపరిచిన విగ్రహాలను త్వరితగతిన తిరిగి ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కే.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

గంగమ్మకు వెండి బిందె వితరణ



తిరుపతి కల్చరల్: తిరుపతి అనంతవీధికి చెందిన గదా ప్రదీప్ గిరిరాజ్, ఎవీ.సత్యనారాయణ తమ కుటుంబ సభ్యులతో కలిసి తాతయ్యగుంట గంగమ్మకు శుక్రవారం రూ.1,04,154ల విలువైన 1.361 గ్రాముల వెండి బిందెను బహూకరించారు. ఈ మేరకు దాతలు వెండి బిందెను ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్‌కు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు.

మాజీ ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



తిరుపతి గాంధీ రోడ్: మోహన్ బాబు యూనివర్సిటీలో జరగనున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతి వచ్చిన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి శుక్రవారం బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు తాజ్ హోటల్‌లో భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం యాదవ్, తొండంనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి స్వాగతం పలికి సత్కరించారు.

25 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో వివిధ నేరాలకు పాల్పడిన 25 మందికి రూ.14,900 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.కోటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ప్రత్యేక పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సబ్సిడీతో ఉలవలు

భాకరాపేట: ఖరీఫ్ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వేరుశనగ విత్తలేక పోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం ఏవోలు ధనలక్ష్మీ, ఖాదర్‌బాషా తెలిపారు. ఆర్బీకే సిబ్బంది, వీఆర్వోలు సంయుక్తంగా సర్వే చేసి వేరుశనగ విత్తని రైతులను గుర్తించి ఈ నెల 8 లోపు జాబితా సిద్ధం చేయాలని కోరారు.

మిగిలిన కార్గో వస్తువుల వేలం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గోకు సంబంధించిన మిగిలిపోయిన వస్తువులను ఈనెల 16, 17, 18వ తేదీల్లో తిరుపతి బస్టాండ్‌లో వేలం వేయనున్నట్లు కార్గో జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 జనవరి 1 నుంచి 2022 డిసెంబర్ 31వ తేదీ వరకు వస్తువులు మిగిలినట్లు పేర్కొన్నారు.

మూలస్థానమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం బుచ్చినాయుడుపల్లి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. వారు సర్పంచ్ రవినాయుడు ఆధ్వర్యంలో ఊరేగింపుగా వచ్చారు. ఆలయంలో అష్ట దేవతలు, వినాయకుడికి, బాల సుబ్రహ్మణ్యం స్వామికి, నవగ్రహాలకు, నాగాలమ్మ దేవతకు విశేష పూజలు చేశారు. 96 మంది మద్యం ప్రియులు మద్యం ముట్టమని సత్య ప్రమాణం చేశారు. మధ్యాహ్నం పెరుమాళ్ళపల్లికి చెందిన గురుమూర్తిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

శ్మశానానికి రోడ్డు ఏర్పాటు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ తూర్పుపల్లి వాసుల శ్మశానానికి రోడ్డు ఏర్పాటుచేశారు. శ్మశానానికి దారి లేక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి చొరవతో అధికారులు రోడ్డు ఏర్పాటు చేశారు. శుక్రవారం రోడ్డు పనులను ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం

చంద్రగిరి (తిరుపతి రూరల్): బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని చంద్రగిరి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని తెలిపారు. చంద్రగిరి మండలం మండపంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించాలన్నారు. తద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల వితరణ

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200ల స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. లయన్ కె.ఎస్.తులసీరామ్ సహకారంతో సుమారు రూ.20 వేలతో ఈ ప్లేట్లను వితరణ చేశారు. హెచ్ఎం సుమలత, లయన్స్ క్లబ్ జీఎంటీత మెంబర్ ఆర్‌వీ.ప్రసాద్, డీసీలు కెఎస్ మస్తాన్, జి.రామయ్య, గోపి, బాలరాజు, గణపతి, రామమూర్తి, ప్రబోధిని, వెంకటరత్నం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అగరాల జగనన్న కాలనీలో బ్రిడ్జి ఏర్పాటు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీకి వెళ్లే రోడ్డులో వాగు నుంచి వర్షపు నీరు వస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో పైపులతో బ్రిడ్జిని ఏర్పాటుచేస్తున్నట్లు సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డెప్ప, అచ్యుతారెడ్డి, మమత కోరారు. వారు శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ హరిప్రసాద్, డాక్టర్లు కవిత, స్వర్ణలత, చంద్రమోహన్, హిమబిందు పాల్గొన్నారు.

12న సుందర తిరుమల –శుద్ధ తిరుమల

తిరుపతి కల్చరల్: ఈ నెల 12వ తేదీన సుందర తిరుమల- శుద్ధ తిరుమల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మే 13వ తేదీన తొలిసారిగా నిర్వహించిన శుద్ధ తిరుమల, సుందర తిరుమల కార్యక్రమం విజయవంతమైందన్నారు. 12వ తేదీన విద్యార్థులతో కార్యక్రమాన్ని విజయంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.